


# ఎరుపు

మంచికంటి

**ఒ**కప్పుడు ఈ లోకమంతా ఎరుపు రంగులో కనిపించాలని ఎన్నెన్నో కలలు కనేవాడిని. ఏమైపోయాయో ఆ కలలు. ఎటువైపు నుండి ఎటు వైపుకు ప్రయాణించానో! ఈ మధ్య మరీ నిస్సారంగా అనిపిస్తుందేమిటో. మరీ జీవం లేకుండా బతుకుతున్నట్టు అనిపిస్తుంది. రాన్రాను అసలెందుకిలాంటి జీవితం గడుపుతున్నానో అర్థం కాకుండా ఉంది. పోగేసుకునే ఆతృతలో ఏమైపోతుందీ తెలియడంలేదే. ఎంత పతనావస్థలోనికి జారిపోతుందీ అర్థమయ్యేసరికీ ఇంత దూరం వొచ్చేశాను.

రాన్రాను లోపలి కుహరంలో ఖాళీ లాంటిదేదో పెరిగిపోతూ ఉంది. జీవితమ్మీద విరక్తి లాంటిదేదో మొదలౌతుందా! ఏమైపోతున్నాన్నేను. ఎంత దూరమిలా ప్రయాణం సాగుతుంది.

ఇన్ని మలుపులకు కారకులెవరు. ఆమేనా... నాలో బలహీనత లేకుండానే ఆమె కారకురాలైందా! నా బలహీనతకు ఆమె ప్రోత్సాహమిచ్చిందా! ఏమో కొన్ని మలుపులు జీవితగమ్యాన్నే మార్చేస్తాయేమో.

ఎంతకాలం ఈమె కోసం ఇలా నిరీక్షిస్తూ గడపడమో. ఎంత వృధా సమయం. ఆమెకు కావలసినవాటిని పోగుజేసుకోవడానికి ఎంత దూరమైనా పోతుంది. ఎంత ఖర్చయినా లెక్క చెయ్యదు. ఎంత కాలమైనా... నాకెందుకీ శిక్ష. ఆమెతో ప్రయాణిస్తున్నందుకా... ఎందురుచూసీ చూసీ జీవితమంతా ఇంతేనా! కడుపులో ఏదో కదులుతున్నట్టుంది. ఈ మధ్యే అప్పుడప్పుడూ ఇలాంటి బాధ కలుగుతుంది.

హమ్మయ్య వొస్తుందిలే. ఆమె చుట్టూ వాళ్ళందరూ... ఓహో ఈమె కొన్న వస్తువుల్నే మోసుకువొస్తున్నారా... ఎన్ని వొస్తువలో... ఈ పిచ్చి ఎంతగా ముదిరిపోయిందో. చూస్తుంటేనే కళ్ళు తిరిగిపోతున్నాయి.

ఆమె వచ్చిందన్నమాటేగానీ నా వైపు కన్నెత్తి కూడా చూళ్ళేదు. వస్తువులన్నిటినీ కారులో సర్దుకునే పనిలో మునిగిపోయింది. ఆమె ముఖంలో ఎన్నెన్ని రంగు రంగుల కాంతులు వెల్లివిరుస్తున్నాయో... ఇద్దరి మధ్య కూడా సర్దిన వస్తువులు గుచ్చుకుంటున్నాయి. డ్రైవింగ్ సీట్లో వొదిగొదిగి కూర్చోవాల్సొస్తుంది. కారు కదులుతుంటే లోపలేదో గిరగిరా తిరుగుతున్నట్టనిపించింది.

ఆమె వస్తువుల వైపు చూస్తుందే కానీ ఒక్కమాట మాట్లాడే స్థితిలో లేదు. తనలో తనే నవ్వుకుంటుంది. గాల్లో చేతులాడిస్తుంది. వాటిని తాకి ముద్దు పెట్టుకుంటుంది. కారు కుదుపులకు వొస్తువలొచ్చి మీద పడుతున్నాయి. నాకేదో అవుతున్నట్టుంది. కడుపులో తిప్పుతూనే ఉంది. కళ్ళు కూడా గిర్రున తిరుగుతున్నాయి. వొళ్ళంతా చెమటలు పట్టేశాయి. బలవంతమ్మీద ఇంటిదాకా వొచ్చాము.

కారు ఆగీ ఆగడంతో హుషారుగా ఈల వేసుకుంటూ ఇంట్లోకి వెళ్ళిందామె. పరుగు పరుగున వొచ్చిన పనిమనిషి వస్తువుల్ని ఇంట్లోకి సర్దడంలో లీనమైపోయింది. కారులో నుండి బయటకు వచ్చే ప్రయత్నంలోనే బొళిక్కిన వాంతయ్యింది. కడుపులో నుండి ఎర్రెర్రని ద్రవమేదో బయటకు వొచ్చేసింది. రెండు చెవుల్నీ రెండు చేతుల్తో మూసుకున్నాను. కళ్ళు ఎర్రగా మారిపోయి మండుతున్నాయి. కళ్ళముందు ప్రతి వస్తువూ ఎర్రగా కనిపించసాగింది.

అడుగులో అడుగేసుకుంటూ నెమ్మదిగా ఇంట్లోకి అడుగు పెట్టాను. ఇల్లంతా అటూ ఇటూ ఊగిపోతున్నట్టుగా ఉంది. లోపల గోడలన్నీ ఎరుపు రంగులోనికి మారిపోతున్నట్టుగా అనిపించసాగింది.

తళతళలాడే కళ్ళతో ఆమె ఎదురుపడింది. చెవులు దద్దరిల్లిపోయే సంగీతానికి అనుగుణంగా డాన్సు చేస్తున్నా ఆమె కళ్ళల్లో నక్షత్రాలు

**"అవును నువ్వేం కావాలని చెయ్యలేదు. మమ్మల్నందర్నీ ముగ్గులోకి దింపి, నువ్వేమో నీకు కావాల్సిన లోకంలోకి పారిపోయొచ్చావు". అప్పుడు అదే సర్వస్వమనుకున్న నువ్వు ఇప్పుడు ఏమీ పట్టనట్టుగా ప్రవర్తిస్తున్నావు. ఈ విధంగా చేసేవాడివి ఎరుపు రంగుని ఎందుకు పులుముకున్నావు. ఎరుపుతోడిదే లోకమని ఎందుకనుకున్నావు. ఎరుపు లేనిదే జీవితం లేదని ఎంత మందికి హితబోధ చేశావు.**

పూస్తున్నాయి. గాల్లో తేలుతున్నట్టు వస్తువుల మధ్య ఊగిపోతూ నా చెయ్యి పట్టుకుని లాగి డాన్స్ చెయ్యమన్నట్టు సైగ చేసింది. చెయ్యి విదిలించుకుని రెండడుగులు వేశాను. తూలి కింద పడబోయాను. అయినా నన్ను పట్టించుకునే స్థితిలో లేదామె. నెమ్మదిగా బెడ్‌రూమ్ తలుపు తెరిచాను. లోపలి తీవ్రతకు కళ్ళు మండాయి. గదంతా ఎరుపుమయమైపోతున్నట్టుగా ఉంది. మళ్ళీ వాంతవుతున్నట్టు అనిపించసాగింది. కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్ళు నేల మీద నుండి తేలిపోతున్నట్టున్నాయి. తల తిరిగిపోతుంది. మంచమ్మీద పడుకుందామనుకునేలోపలే వొరిగిపోయాను.

లోకమంతా గిర్రున తిరుగుతున్నట్టుగా ఉంది. ఎరుపుమయమైన లోకంలోకి దూసుకుపోతున్నట్టు అనిపించసాగింది. చుట్టూ ఉన్న ఎరుపురంగు గోడలు దగ్గర దగ్గరగా వొస్తూ ఆకారం మార్చుకుంటున్నాయి. మీద మీదకొస్తూ దూదిపింజల్లాగా తేలుతూ తేలుతూ తేలుతూ వింత వింత ఆకారాల్లోకి మారుతున్నాయి.

ఏమిటా ఆకారాలు... పొడవుగా లావుగా మనుషుల్లాగా మారిపోయారే. మనుషులే... ఎవరు వాళ్ళు... తెలిసినవాళ్ళలాగా ఉన్నారే. అవును వాళ్ళే. నా ఉపన్యాసాల కోసం పడిచచ్చినవాళ్ళే. నా సిద్ధాంత చర్యలతో రంగంలోకి దూకినవాళ్ళే. నా ప్రబోధాలతో సర్వం ప్రజలకు అర్పించినవాళ్ళే. ఎరుపురంగు మనుషులు. దగ్గరగా ఇంకా దగ్గరగా వొస్తున్నారు. చుట్టూ తిరుగుతున్నారు. అమ్మో... వెర్రికేక వేశాననుకున్నాను కానీ గొంతులో నుండి కేక బయటకు రాలేదు. నెమ్మది నెమ్మదిగా అపస్మారకంలోనికి వెళ్ళిపోతున్నట్టు అనిపించసాగింది.

కాస్త స్పృహలో కొద్దిగా మెలకువలో... ఎరుపు మనుషులు చుట్టూ తిరుగుతున్నారు. దగ్గరగా వొచ్చి మింగెయ్యబోతున్నారు.

ఏయ్ ఎవరు మీరు... వొద్దొద్దు రావొద్దు దగ్గరగా రావొద్దు అనేకొద్దీ దగ్గరగా వొస్తూనే ఉన్నారు. వొళ్ళంతా చెమటలు కారుతున్నాయి. పక్కబట్టలు కూడా తడిపి చల్లగా అయిపోతున్నాయి.

"ఏయ్... ఏయ్ ఎవరు మీరు?" వెర్రికేక వేశాను.

"మేమా... మేమెవరిమో తెలియదా!" గద్దిస్తున్నారు వాళ్ళు.

"ఎవరో నాకేం తెలుసు... నాకు తెలియదు. నన్నేం చెయ్యడానికొచ్చారు మీరు? ఏం జరుగుతుందిక్కడ?"

"ఏం జరుగుతుందో తెలియనంతగా కళ్ళు మూసుకుపోయాయిరా నీకు" వాళ్ళల్లో బాగా పెద్దగా ఉన్న ఆయన ప్రశ్నించాడు.

"ఏమిటి నాకా కళ్ళు మూసుకుపోయాయా! లేదే నేనేం చెయ్యలేదే. నాకేం తెలియదే" భయం భయంగా చెప్పాను.

"నీకు తెలియకుండానే జరిగేయన్నీ జరుగుతున్నాయా. చాలా అమాయకంగా మాట్లాడుతున్నానని అనుకుంటున్నావా!" ఎర్రగా మండుతున్నాయన ప్రశ్నించాడు.

"నేను కావాలని ఏ పనీ చెయ్యలేదు. నా పని నేను చేసుకునిపోతున్నాను అంతేగా".

"అవును నువ్వేం కావాలని చెయ్యలేదు. మమ్మల్నందర్నీ ముగ్గులోకి దింపి, నువ్వేమో నీకు కావాల్సిన లోకంలోకి పారిపోయొచ్చావు". అప్పుడు అదే సర్వస్వమనుకున్న నువ్వు ఇప్పుడు ఏమీ పట్టనట్టుగా ప్రవర్తిస్తున్నావు. ఈ విధంగా చేసేవాడివి ఎరుపు రంగుని ఎందుకు పులుముకున్నావు. ఎరుపుతోడిదే లోకమని ఎందుకనుకున్నావు. ఎరుపు లేనిదే జీవితం లేదని ఎంత మందికి హితబోధ చేశావు. నిన్ను నమ్ముకుని వొచ్చినవాళ్ళని ఎంతమందిని మోసం చేస్తున్నావో ఆలోచించావా!

"ఏంలేదే... నేనెవరికీ అన్యాయం చెయ్యలేదే... నాకు కావలసిందేదో నేను చేసుకుపోతున్నాను".




"అని నువ్వు అనుకుంటున్నావో నటిస్తున్నావో కానీ, ఎంత ఉన్నత శిఖరం నుండి ఎంత అధఃపాతాళానికి పడిపోయావో తెలుస్తుందా నీకు".

"అధఃపాతాళానికా... నేనా... ఎందుకింత పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు మీరు".

ఆ మాటకాయనకు కోపం వచ్చింది. అప్పుడెంత ఉన్నతమైనది నీ ఆశయం. అందరిలాగా నువ్వు కూడా ప్రలోభపడ్డావు. ఎంత దిగజారిపోయావు. ఒకప్పుడు ఎవరినైతే అసహ్యించుకుని ఎదురించావో, తప్పుడు మార్గమని దేనినన్నావో ఇప్పుడు వాళ్ళలోనే నువ్వూ కలిసిపోయావు. వాళ్ళతోటిదే లోకమనుకుంటున్నావు కదా!"

"నన్నెందుకిలా నిందిస్తున్నారు. ఎందుకిలా మాటలతో చిత్రవధ చేస్తున్నారు" కోపంగా అరిచాను.

"నీ గురించి నీకు తెలియదా! ఎరుపు రంగులో ఎంతగా తల మునకలై ఉండేవాడివి. అది తప్ప ఇంకో ప్రపంచం ఉండేదా నీకు. నీ శ్వాస ధ్యాస ధ్యానం జ్ఞానం అంతా అదే కదా! మెలకువలోనూ, నిద్రలోనూ, కలల్లోనూ, కలతల్లోనూ అన్నింటా ఎరుపుమయమై ఉండేది కదా! నీ చూపు ఎరుపు నీ రూపు ఎరుపు. అంతరంగంలోనూ బహిరంగంలోనూ ఎరుపు మబ్బులే కమ్ముకుని ఉండేవి కదా! ఏమైపోయాయి ప్పుడవి? అసలు నువ్వు ఈ అవస్థ లోనికి ఎప్పుడు అడుగిడావో గుర్తుందా! నీ పతన ప్రస్థానం ఏ విధంగా జరిగిందో గుర్తుందా నీకు" బాణం సంధించినట్టు ప్రశ్నించాడాయన.



"సౌందర్యవతి అయిన ఆమె తాత్కాలిక ఆవేశంతోనూ, ఉద్రేకంతోనూ, ప్రతీకారంతోనూ వొచ్చింది. అపురూపమైన ఆమె సుందర రూపం నిన్నెంతగానో ఆకర్షించింది. అక్కడనుండి నీ అధ్యయనానికి తెరపడింది. నీ కళ్ళకు పొరలు అప్పుడప్పుడే కమ్ముకోసాగాయి. ఎంతోమంది నీ చర్యలను వారించారు. అయినా ఆమె కోసం అందరినీ ధిక్కరించావు".

తల విదిలించాను. తలంతా దిమ్మెక్కిపోయి ఏమీ గుర్తుకు రావడం లేదు. వీళ్ళెవరో నన్ను చిత్రవధ చెయ్యడానికి వొచ్చినట్టున్నారే. వాళ్ళవైపు పిచ్చి చూపులు చూస్తున్నాను.

"నువ్వు ఎంతలోతు ఊబిలో కూరుకుపోయావో కూడా తెలుసుకోలేని స్థితిలో ఉన్నావులే. ఇప్పుడు నీ మెదడు వస్తుమయ ప్రపంచం, లాభాల ప్రపంచం, లావాదేవీల ప్రపంచం, కబ్జాల ప్రపంచం... ఆస్తిపాస్తుల గొడవలతో నిండిపోయి ఉంది కదా! వెనుకకు తిరిగిచేసే అవకాశమే లేదిప్పుడు" ఆవేశంతో ఊగిపోతున్నాడతను.

ఏమిటితను ఏవేవో పిచ్చిమాటలు మాట్లాడుతున్నాడు. నాకేమీ అంతుబట్టటము లేదే. మనుషులకు చాలా అవసరాలుంటాయి కదా! అవసరమైనవాటినన్నీ సమకూర్చుకోవాలిగదా! ఇవన్నీ లేకుండా సమాజంలో ఎలా బతకాలి.

"ఎంత పిచ్చిగా మాట్లాడుతున్నావో వ్యంగ్యంగా నవ్వాడతను. నువ్వు ఎరుపు లోకంలో ఉన్నప్పుడు ఎలా ఉన్నావు. గాలీ నీరూ ఆహారమూ అన్నీ దానితోడిదే లోకం కదా! ఎవరికి సాయం అవసరమైతే వాళ్ళవెంట ఉంటూ, చెడు చేసేవారికి సింహస్వప్నమౌతూ నీ దారిలో నువ్వు సాగిపోతున్నప్పుడు, నీకింక వేరే ప్రపంచమే లేదనుకున్నప్పుడు ఎందరికో జ్ఞానాన్నిందించిన మహాజ్ఞానివి నువ్వు" ఆవేశంగా చెప్పుకుపోతున్నాడతను.

నన్ను జ్ఞాని అంటాడేమిటితను. ఇతను మాట్లాడేదంతా అయోమయంగా ఉంది. అతను వేరే లోకానికేదో వెళ్ళి మాట్లాడుతున్నట్టుంది.

"సౌందర్యవతి అయిన ఆమె తాత్కాలిక ఆవేశంతోనూ, ఉద్రేకంతోనూ, ప్రతీకారంతోనూ వొచ్చింది. అపురూపమైన ఆమె సుందర రూపం నిన్నెంతగానో ఆకర్షించింది. అక్కడనుండి నీ అధ్యయనానికి తెరపడింది. నీ కళ్ళకు పొరలు అప్పుడప్పుడే కమ్ముకోసాగాయి. ఎంతోమంది నీ చర్యలను వారించారు. అయినా ఆమెకోసం అందరినీ ధిక్కరించావు".

"నువ్వు చెప్పేది నా దగ్గరున్న సౌందర్యరాశి గురించేనా! సౌందర్యారాధన తప్పెలా అవుతుంది. మనసున్న ప్రతి మనిషికీ సౌందర్యాన్ని ఆస్వాదించి అనుభవించే హక్కుంది కదా!

"కావొచ్చు. నువ్వామె సౌందర్యానికి పూర్తిగా లొంగిపోయావు. అప్పటినుండీ ఆమెకేమీ బోధించలేకపోయావు. అందుకే జ్ఞానము నుండి దూరమైపోయావు. ఆమె అందచందాలే నీకన్నీ బోధించసాగాయి. దాంతో నీ కర్తవ్యం మరిచిపోయే స్థితికి చేరుకున్నావు. ఆమెదే లోకంగా బతికావు. ఆమేమో... నేర్చుకోవాలనో, త్యాగం చెయ్యాలనో, సమాజాన్ని ఉద్ధరించాలనో రాలేదు. కాబట్టీ ఆమె అనుకున్న పని అయిందాకా మీతోనే ఉంది. ఉన్న కాలంలోనైనా నువ్వామెకేమీ బోధించడానికి ప్రయత్నించలేదు. అప్పుడే చాలా మంది హెచ్చరించారు. వాళ్ళను ఈసడించుకున్నావు నువ్వు" గతాన్ని గుర్తు చేస్తున్నాడతను.

అవును ఈయన చెప్పేది కొద్ది కొద్దిగా మెదడు పొరల్లో నుండి బయటపడుతుంది.

"నిజమే కానీ పెద్దాయనా సౌందర్యం ఎవరినైనా ముగ్ధుల్ని చేస్తుంది కదా! అందరిలాగా నాకూ మనస్సుంది కదా! మనిషి సహజమైన కోర్కెలుంటాయి కదా!"

"కోర్కెలు తీర్చుకోవడం తప్పు కాదు. వాటికోసం మిగిలిన ప్రపంచాన్నే వదిలివేయడం తప్పు. ఆమెకోసం విలవిల్లాడిపోయావు నువ్వు. తపించిపోయావు. కొంత కాలానికి ఆమె ముందు నడిచింది. నీ మార్గాన్ని మరిచిపోయావు. ఆమె కొంగు పట్టుకున్నావు. నువ్వూ ఈ లోకంలోకి వొచ్చావు".

"నాకు శరీరం సహకరించలేదప్పుడు. ఆరోగ్యం పాడైపోయింది. అప్పుడు కూడా ఎవరికోసమో త్యాగం చెయ్యాల్సిందేనా!".

"ఎంత అందమైన అబద్ధం ఆడుతున్నావు. నిన్నెవరూ బలవంతంగా ఈడ్చుకొచ్చి త్యాగాలు చెయ్యమనలేదే. నువ్వొక ఆశయంతో ఇక్కడికి వొచ్చావు. ఈ ఆశయమే నీ జీవితమని నమ్మావు. ఎందరినో నీ మార్గం పట్టించావు. ఇప్పుడు నన్ను కూడా దబాయిస్తున్నావు" హేళనగా నవ్వాడతను.

సరే నువ్వనుకున్నట్టే అనారోగ్యమే. ఆ తరువాత... ఆరోగ్యం కుదుటపడ్డ తరువాత నువ్వున్న చోట కూడా నీ ఆశయానికి అనుగుణంగా నడవొచ్చు కదా!"

"నేనున్న చోటా ఎలా వీలవుతుంది?"

"పోనియ్ వీలు కాలేదు. నీ మార్గంలోనైనా నువ్వు నడుస్తున్నావా! అదీ లేకపోగా నువ్వూ పీడకులతో పాటుగా చేరిపోయావు. మీ ఇంటినిండా ఉండే గ్రంథాలన్నీ ఏమైపోయాయో తెలుసా నీకు".

"అవా... అవీ... పాడైపోయాయని పారేసిందామె".

"పుస్తకాన్ని గురించి ఆలోచించే తీరికే లేకుండా పోయింది నీకు. ఆమె ఏమి చెబితే అదే నిజమని నమ్మావు అనేకంటే గూడా నీకవసరమైనదేదో దానివెంటబడి పరుగులు తీశావు. నువ్వు చెప్పిందే నిజమనుకుందాం కాసేపు. పోయినవాటి స్థానంలో కొత్త పుస్తకాలతో నింపవచ్చుకదా! ఉన్న నాలుగు పుస్తకాలూ ఎలా దుమ్ము కొట్టుకుని అసహ్యంగా ఉన్నాయో కనబడడం లేదా! నువ్వసలు వాటిని పట్టించుకునే స్థితిలో ఉన్నావా! పుస్తకాలు తీసేసిన స్థానంలో ఎన్నెన్ని కొత్త కొత్త వస్తువులు వొచ్చి చేరాయో తెలుస్తుందా నీకు. ఇల్లంతా వస్తువులతో నిండేకొద్దీ ఎరుపురంగు మాయమవడం గమనించలేదా నువ్వు".

అవున్నిజమే. మీరంటుంటే గుర్తుకొస్తుంది. నా పనుల వత్తిడిలో ఇవన్నీ గమనించనేలేదు".

"నువ్వాస్థితిలో లేవులే నాయనా అప్పటిదాకా మౌనంగా చూస్తున్న ఒంటిచేతి పెద్దాయన అన్నాడు. అప్పుడు ఏదైతే చెడు అనుకున్నావో అదే ఇవాళ నీకు మంచైంది. ఎవరైతే మనుషులు కాదన్నావో వాళ్ళే ఇవాళ నీ బంధువులు, స్నేహితులు. ఆమె వొంటినిండా నగలు పోగవుతున్నప్పుడు నీవెంత మైకంలో ఉన్నావో తెలియదు. నువ్వు భోగభాగ్యాలతో తులతూగుతున్నప్పుడు మామూలు మనుషులు మనుషులు కాదు. వాళ్ళు పడే బాదలు బాధలుగా కనిపించలేదు. పైగా వాళ్ళనే పీడిస్తూ దండించే స్థితికొచ్చావు".

అవునవును. ఇప్పుడు ఆలోచిస్తుంటే మీరు చెప్పేవన్నీ నిజాలే అనిపిస్తున్నాయి. నేనెందుకు మతిస్థిమితం కోల్పోయానో నాకే తెలియడం లేదు".

"సంపద పెంచుకోవడానికి అలవాటు పడితే రక్తం రుచిమరిగిన పులిలాగా తయారవుతారా లేదా! అలాగే అయ్యావు కదా నువ్వు. నీ స్వార్థంతో ఎంతమందిని దురవస్థలోకి నెడుతున్నావో ఆలోచించావా నువ్వు" ఒంటిచేయి ఊపుతూ అడిగాడతను.

"అవునవును కొద్ది కాలంగా నాకూ తేడా తెలుస్తుంది. ఇప్పుడు మీరు చెబుతుంటే రీలు లాగా కళ్ళముందు కదలాడుతూ ఉంది".

"ఇప్పుడు చెప్పు ఎర్రగా బుర్రగా నీ ముందు మేము ఉండాల్సిన అవసరమేముంది చెప్పు" ఎరుపుగుడ్డు మిటకరిస్తూ గాల్లో తేలిపోతూ అడిగాడాయన.

"అంతమాట అనకండేం. మీరు లేకుంటే నేనేమైపోతాను. మీరు తప్పకుండా నా చెంతన ఉండాల్సిందే".

"ఎందుకూ ఈ ముసుగులో నీ దందాలు నెరపుకోవచ్చునా! నీ సంపాదనకు మేము కూడా ఉపయోగపడాలనేకదా నువ్వు చెప్పేది. ఎంతమాత్రం వీలుకాదు. మేం మీ ఇంటి నుండి పూర్తిగా వెళ్ళిపోతే నన్నా బుద్ధొస్తుందేమో చూద్దాం" అంటూ ఎరుపు రంగు మనుషులందరూ దూదిపింజలుగా మారిపోతున్నారు.

"వొద్దొద్దు. మీరు వెళ్ళొద్దు. ఇంతకాలం నా కళ్ళు మూసుకుపోయాయి. ఇంక నాకు బుద్ధొచ్చింది. నన్ను నమ్మండి. మీరే లేకుంటే ఇంకా అన్యాయమైపోతాను. నేను చెప్పేది నమ్మండి".

"ఎలా నమ్మమంటావు. ఇంత దిగజారిపోయావ్ ఇంకా పూర్వస్థితిలోకి ఎలా వస్తావు చెప్పు. ఎవరైనా నమ్ముతారా నిన్ను" అందరూ ఏక కంఠంతో అరిచారు.

"తప్పు చేసినవాడికి దిద్దుకునే అవకాశం ఉండదా! నా తప్పు నేను తెలుసుకుని జరిగిన పొరపాట్లు సరిదిద్దుకుని మామూలు మనిషి కావడానికే అవకాశము లేదా!"

**"ఏం చెయ్యాలో కూడా ఆలోచించలేని స్థితికి వొచ్చావు నువ్వు. నీ కళ్ళముందు జరిగేవాటిని చూడు. ఆలోచించు. అజ్ఞానం నుండి బయట పడడానికి పుస్తకాలు ఉండనే ఉన్నయ్యి కదా. దుమ్ము దులుపు. అధ్యయనం మొదలుపెట్టు. అజ్ఞానం నుండి బయటబడడానికి అధ్యయనమే మూలాధారమని ఎన్నోసార్లు నువ్వే చెప్పావు కదా!"**

"అంటే ఇంకా ఎక్కడో ఆశ మినుకు మినుకుమంటుందన్నమాట. ప్రయత్నిస్తే సాధ్యం కానిదేమీ ఉండదు. చూద్దామా... వాళ్ళల్లో ఒకరినొకరు సైగలు చేసుకుంటున్నారు. కాసేపటి తరువాత సరే ప్రయత్నించు" అన్నాడా పెద్దాయన.

"ఎలా ప్రయత్నించాలి. ఏం చెయ్యాలో చెప్పండి?"

"ఏం చెయ్యాలో కూడా ఆలోచించలేని స్థితికి వొచ్చావు నువ్వు. నీ కళ్ళముందు జరిగేవాటిని చూడు. ఆలోచించు. అజ్ఞానం నుండి బయట పడడానికి పుస్తకాలు ఉండనే ఉన్నయ్యి కదా. దుమ్ము దులుపు. అధ్యయనం మొదలుపెట్టు. అజ్ఞానం నుండి బయటబడడానికి అధ్యయనమే మూలాధారమని ఎన్నోసార్లు నువ్వే చెప్పావు కదా!"

"అవునవును గుర్తొచ్చింది. మళ్ళీ మొదలుపెడతాను. అన్నీ వొదిలేసుకుని మొదలుపెడతాను".

"మరింకేం ఇప్పటినుండే ప్రారంభించు" ముక్తకంఠంతో అరిచారు ఎరుపు రంగు దూదిమనుషులు.

"మరి మీరు నాతోనే ఉంటారా" అనుమానంగా చూశాను వాళ్ళను.

"చూస్తాం. నీలో మార్పుని బట్టి ఆధారపడి ఉంటుందిలే" వల ఎగరేస్తూ చెప్పాడు ఒంటిచేతి పెద్దాయన.



"అప్పటిదాకా నా దగ్గరే ఉండండేం" ఆప్యాయంగా వాళ్ళందర్నీ కౌగిలించుకోబోయాను. వాళ్ళు మనుషుల ఆకారాల నుండి ఎరుపురంగు పింజలుగా మారుతూ మారుతూ నెమ్మది నెమ్మదిగా గోడల్లోకి ఇంకిపోసాగేరు.

స్పృహలోకొచ్చి కళ్ళు తెరిచి చూసేసరికి కళ్ళముందు ఎవరూ లేరు. చుట్టూ చూస్తే ఏమీ కనిపించలేదు. భోరుమని ఏడ్చేశాను. కళ్ళ నుండి కన్నీళ్ళు ధారకట్టసాగాయి.

నాలో నూతన శక్తేదో ప్రవహించసాగింది. కనిపించే ప్రపంచం కొత్తగా అనిపించసాగింది. నిద్రపోతున్న శక్తులేవో మేలుకోసాగాయి.

తలుపు తెరిచిన అలికిడైంది. తల తిప్పి చూశాను. ఆమె లోపలికి వచ్చింది. నా ముఖం చూసి భయయంతో వణకసాగింది. నా దగ్గరకు రావడానికే జంకింది. బయటకు వస్తూ ఆమెను చూసిన చూపుకు ఆమె అక్కడే కూలబడిపోయింది.

తలుపు తెరుచుకుని హాల్లోకొచ్చాను. ఒక మూలన సాలెగూళ్ళు అల్లుకుని ఉన్నాయి. పుస్తకాల అరలు. వాటి తలుపు తెరిచాను. కిర్రుమని శబ్దం చేశాయి. పుస్తకాలు తాకాను. చేతుల్లో నుండి దివ్యజ్ఞానమేదో ప్రవహించినట్టుంది. వాటిపై పేరుకుపోయిన దుమ్మును దులిపాను.

ఇప్పుడు మా ఇంటిలోకి ఎరుపురంగు చాయలు గాల్లో తేలుతూ వొస్తున్నాయి. ఇంతకుముందులేని కొత్తగాలులు లోపలికి ప్రవేశించసాగాయి. నాలో కొత్త కొత్త ఊహలు చిగురులు తొడగసాగాయి.